సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 31 । మే । 2024



సబ్సిడీపై జీలుగ విత్తనాలు

రైతులకు 60శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు.

- 8లో ▸



ఆరోగ్య కేంద్రాల తనిఖీ

నవీపేట మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
41.9 /30.0

వాతావరణం

ఉదయం నుంచి ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

లక్ష్యం మరింత భారం

బ్యాంకు లింకేజీ లక్ష్యాలు ఐకేపీ అధికారులను వణికిస్తున్నాయి. ప్రతి ఏడాది పెంచుతూ పోవడంతో టార్గెట్‌ను ఛేదించడం కష్టంగా మారుతోంది. పరిమితికి మించి లక్ష్యాన్ని ఇవ్వడంతో మహిళా సంఘాలకు బలవంతంగా రుణాలు ఇవ్వాల్సి వస్తోందని ఐకేపీ అధికారులు, సిబ్బంది వాపోతున్నారు. 27 మండలాలకు మొత్తం రూ.1,227 కోట్లుగా నిర్దేశించారు. గతేడాదితో పోలిస్తే రూ.200 కోట్లు అదనంగా పెంచారు.



సమావేశమైన ఎస్‌హెచ్‌జీ మహిళలు(ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్): 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాకు బ్యాంకు లింకేజీ లక్ష్యం ఇటీవల ఖరారైంది. 27 మండలాలకు కలిపి మొత్తం రూ. 1,227 కోట్లు నిర్దేశించారు. గతేడాదితో పోలిస్తే రూ. 200 కోట్లు అదనంగా పెంచి ఇచ్చారు. ఈ టార్గెట్‌ను చూసి ఐకేపీ అధికారులు వణికిపోతున్నారు. దీనిని చేరుకోవడం కష్టమని, అవసరం లేకున్నా ఎస్‌హెచ్‌జీలపై భారం వేయలేమని స్పష్టం చేస్తున్నారు. లక్ష్యాన్ని తగ్గించాలని రాష్ట్ర సెర్ప్‌శాఖకు లేఖ పంపాలని ఏపీఎంలు, జిల్లా స్థాయి అధికారులు నిర్ణయానికి వచ్చారు. ఎస్‌హెచ్‌జీ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలను అందజేస్తోంది. సంఘాల నుంచి కూడా డిమాండ్ ఉండడంతో గతంలో లక్ష్యానికి మించి అధికారులు రుణాలు అందజేశారు. అయితే, లక్ష్యానికి మించి రుణాలు ఇస్తున్నారనే ఉద్దేశంతో ప్రభుత్వం గత నాలుగేళ్లుగా జిల్లాకు భారీ లక్ష్యాలను కేటాయిస్తోంది.

- పరిమితికి మించి జిల్లాకు బ్యాంకు లింకేజీ లక్ష్యం పెంపు
- ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 1,227 కోట్లు నిర్దేశం
- గతేడాదితో పోలిస్తే రూ. 200 కోట్లు అదనం
- లక్ష్యాన్ని తగ్గించాలని కోరుతున్న ఐకేపీ అధికారులు

■ 2019–20 సంవత్సరంలో రూ. 800 కోట్లు ఉన్న టార్గెట్‌ను ప్రతిఏడాది కొంత పెంచుతూ రూ. వెయ్యి కోట్లు దాటించారు. వెయ్యి కోట్లను కాస్త ప్రస్తుత ఏడాదికి రూ. 1,227 కోట్లకు పెంచారు. గతేడాది రూ. 1,032 కోట్ల లక్ష్యం ఉంటే అతికష్టం మీద లక్ష్యానికి మించి అధికారులు రూ. 1,065 కోట్ల రుణాలను 15,590 మహిళా సంఘాలకు అందజేశారు. ప్రస్తుతం 2024–25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన భారీ లక్ష్యంలో అత్యధికంగా ఉమ్మడి బోధన్ మండలానికి రూ. 73.70 కోట్లు కేటాయించారు. తర్వాత నందిపేట్ ఉమ్మడి మండలానికి రూ. 68.37కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించారు. పెద్ద మండలాలకు రూ. 40 కోట్లకు తగ్గకుండా లక్ష్యాలను ఇచ్చారు. దీంతో అక్కడి ఏపీఎంలు, సీసీలకు భయం పట్టుకుంది. లక్ష్యాలను తగ్గించకపోతే పని చేయలేమని చెబుతున్నారు.

ఖరారుకాని స్త్రీనిధి లక్ష్యం..

స్త్రీనిధి పథకానికి 2024–25 వార్షిక లక్ష్యం ఇంత వరకు ఖరారు కాలేదు. రాష్ట్ర శాఖ నుంచి టార్గెట్ కేటాయించకపోవడంతో అధికారులు ఈ ఏడాది ఒక్కరికి కూడా స్త్రీనిధి రుణం ఇవ్వలేదు. అర్హులైన ఎస్‌హెచ్‌జీ మహిళలు స్త్రీనిధి రుణం కోసం ఎదురుచూస్తున్నారు. ఐతే, ఇటీవల ముగిసిన ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు రూ.239కోట్ల లక్ష్యాన్ని కేటాయించగా, దానిని రూ.191కోట్లకు కుదించారు. తగ్గించిన లక్ష్యాన్ని కూడా అధికారులు పూర్తిగా చేరుకోలేకపోయారు. ప్రస్తుత ఏడాదికి ప్రభుత్వం టార్గెట్ ఎంత ఇస్తుందో స్పష్టత లేకుండా పోయింది.

రూ. వెయ్యి కోట్లకు తగ్గించాలి

జిల్లాకు నిర్దేశించిన బ్యాంకు లింకేజీ టార్గెట్ ఉద్యోగులకు భారమనే చెప్పాలి. ప్రతి ఏడాది రుణ లక్ష్యాలను పెంచడం వలన మండలాల్లో పనిచేసే ఉద్యోగులకు కష్టంగా మారుతోంది. మహిళా సంఘాలకు బలవంతంగా రుణాలు అందజేయాల్సి వస్తోంది. దీంతో ఎన్‌పీఏ పెరిగి తిరిగి ఉద్యోగులపై ప్రభావం పడుతోంది. అవసరం మేరకు టార్గెట్‌ను ఇస్తే బాగుటుంది. ప్రస్తుత ఏడాది టార్గెట్‌ను రూ. వెయ్యి కోట్లకు పరిమితం చేయాలి.

– బత్తుల మాణిక్యం, జిల్లా అధ్యక్షుడు, ఐకేపీ ఉద్యోగుల సంఘం

న్యూస్‌రీల్

సివిల్ సప్లయ్ డీఎస్‌వో, డీఎం సస్పెన్షన్



చంద్రప్రకాశ్

సుభాష్ నగర్: జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చంద్రప్రకాశ్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జగదీష్ కుమార్ ను సస్పెండ్ చేస్తూ గురువారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని అనేక రైస్ మిల్లుల నుంచి 2021–22 సంవత్సరానికి సంబంధించి సీఎంఆర్ బియ్యం తీసుకోవడంలో ఉదాసీనంగా వ్యవహరించడంతో పాటు ధాన్యం కొనుగోళ్లలో రైస్ మిల్లర్లతో కుమ్మక్కు అయ్యారనే ఆరోపణలు వీరిపై ఉన్నాయి. అంతేగాకుండా రైస్ మిల్లుల్లో ధాన్యం నిల్వలు లేకున్నా.. ఉన్నట్లు నివేదికలు ఇవ్వడం, సకాలంలో బియ్యాన్ని తీసుకోకపోవటంతో ప్రభుత్వానికి తీవ్రనష్టం వచ్చింది. ప్రభుత్వం ఈ విషయంలో రైస్ మిల్లర్ల పై కూడా సీరియస్ గా ఉంది. దీంతో పాటు రైస్ మిల్లులకు కోటాకు మించి ధాన్యం కేటాయింపులు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆరోపణలపై శాఖాపరంగా అంతర్గత విచారణ చేపట్టినట్లు తెలిసింది. విచారణ అధికారుల నివేదికల ప్రకారం పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు, ప్రభుత్వం వీరిని సస్పెండ్ చేసిందని సమాచారం.

'సదరం' తేదీలు ఖరారు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో జూన్ మాసానికి సంబంధించిన సదరం క్యాంపుల నిర్వహణ తేదీలు ఖరారైనట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5,12,19 తేదీల్లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు క్యాంపు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 31న మీ సేవ కేంద్రాల్లో స్లాట్లు విడుదల చేస్తామని, ఇదివరకే స్లాట్ బుక్ చేసుకున్న వారి మొబైల్ నంబర్‌కు ఎస్‌ఎంఎస్ వస్తుందని తెలిపారు. దివ్యాంగులు నిర్ణీత తేదీల్లో సదరం క్యాంపునకు హాజరు కావాలని సూచించారు.

మోడిఫైడ్ సైలెన్సర్లు వాడితే క్రిమినల్ చర్యలు



ఖలీల్‌వాడి: బైక్‌లకు కంపెనీ నుంచి వచ్చిన సైలెన్సర్లను తీసేసి మోడిఫైడ్ సైలెన్సర్లను ఏర్పాటు చేస్తే వాహనాదారుడితోపాటు మార్చిన మెకానిక్‌పై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ హెచ్చరించారు. ఇటీవల కాలంలో స్వాధీనం చేసుకున్న 122 సైలెన్సర్లను సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో రోడ్డురోలర్‌తో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ద్విచక్రవాహనాలకు మాడిఫైడ్ సైలెన్సర్లను బిగించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. శబ్ద, వాయు కాలుష్యం, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లా రవాణా శాఖాధికారి జె ఉమామహేశ్వరరావు, డీసీపీ శేషాద్రినిరెడ్డి, ట్రెయినీ ఐపీఎస్ అధికారిణి చైతన్యరెడ్డి, ట్రాఫిక్ సీఐ వెంకట్‌నారాయణ పాల్గొన్నారు.

పాత పనులను పూర్తిచేయాలి



నిజామాబాద్ రూరల్ : రోడ్ల మరమ్మతులను పూర్తి చేయించాలని, ఆయా శాఖల పరిధిలో పాత పనులను త్వరగా పూర్తిచేయాలని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అధికారులను ఆదేశించారు. నిర్వహించిన ఆర్థిక ప్రణాళిక, పనుల కమిటీ, సాంఘిక సంక్షేమ స్థాయీ సంఘ సమావేశాలను విఠల్‌రావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలిగితే సంబంధిత అధికారులు బాధ్యులవుతారని స్పష్టం చేశారు. జెడ్పీ సాధారణ నిధులు, రాష్ట్ర ఆర్థిక సంఘం, 15వ ఆర్థిక సంఘం ద్వారా 2020–21 నుంచి 2023–24 వరకు మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని పంచాయతీ శాఖ అధికారులను ఆదేశించారు. సీఈవో ఉష, డిప్యూటీ సీఈవో సుందర వరదరాజన్, జెడ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి



డిచ్‌పల్లి మండలం అమృతాపూర్ క్యాంప్‌లో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ

డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి: నూతన విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులను పూర్తి చేయించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులను కలెక్టర్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిచ్‌పల్లి మండలం అమృతాపూర్ క్యాంప్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలతోపాటు జక్రాన్‌పల్లి మండలం అర్గుల్, లక్ష్మాపూర్ గ్రామాల్లోని ప్రైమరీ స్కూళ్లను, మునిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. కిచెన్‌షెడ్లు, టాయిలెట్లు, ఫ్లోరింగ్, తరగతి గదులు, పైకప్పు, డిజిటల్ క్లాస్ రూములు, నీటిసంపు, వాటర్ ట్యాంక్ తదితర పనులను పరిశీలించారు. ఇప్పటివరకు చేపట్టిన, పూర్తయిన పనులు, వెచ్చించిన నిధులకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మరో వారం, పది రోజుల్లో ఏ ఒక్క పని పెండింగ్ లేకుండా పూర్తి చేయించాలన్నారు. పనుల నాణ్యతలో రాజీపడొద్దని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. పాఠశాలలను గ్రామ పంచాయతీ కార్మికుల సహాయంతో శుభ్రం చేయించాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, డీఈవో దుర్గాప్రసాద్, మండల ప్రత్యేక అధికారి యోహాన్, తహసీల్దార్ కిరణ్మయి, పంచాయతీ రాజ్ ఈఈ శంకర్ తదితరులు ఉన్నారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



నిజామాబాద్‌నాగారం: చట్టాన్ని ఉల్లంఘిస్తే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్(స్థానిక సంస్థలు) అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌కు సంబంధించి డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రాప్రియెట్ అథారిటీ జిల్లా కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్‌లోని అడిషనల్ కలెక్టర్ చాంబర్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంకిత్ మాట్లాడుతూ.. లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. స్త్రీ, పురుష నిష్పత్తి తక్కువ ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో 151 స్కానింగ్ సెంటర్లు ఉండగా, అందులో 125 మాత్రమే పని చేస్తున్నాయని, రిజిస్ట్రేషన్, రెన్యువల్ తప్పకుండా చేసుకోవాలన్నారు. స్కానింగ్ సెంటర్లలో అర్హులనే నియమించుకోవాలని, మహిళా సిబ్బంది ఉండాలని సూచించారు. డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ మాట్లాడుతూ.. స్కానింగ్ సెంటర్ల ఏర్పాటు కోసం మూడు, రెన్యువల్ కోసం 11 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అలాగే స్కానింగ్ సెంటర్ క్యాన్సలేషన్ కోసం మరో మూడు దరఖాస్తులు అందాయన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖతో కలిసి జిల్లాలోని సుమారు 25 మండలాల్లో పీసీపీఎన్‌డీటీ యాక్ట్, బేటీ బచావో బేటీ పడావో, మహిళా సాధికారత అంశాలపై ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, విలేజ్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్లకు విస్తృతంగా అవగాహన కల్పించినట్లు వివరించారు. సమావేశంలో అదనపు పోలీసు కమిషనర్ ఎల్ రాజవెంకటరెడ్డి, సీడీపీవోలు స్వర్ణలత, నందిని, లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ అధ్యక్షుడు విజయానంద్, జ్యుడీషియరీ సూపరింటెండెంట్ సయ్యద్ ఇర్షాద్ బుకారీ, గంగాధర్, డీహెచ్ఈ వెంకటేశ్వర్లు, దేవేందర్ పాల్గొన్నారు.

జూలైలో అగ్నివీర్ వాయు నియామక ర్యాలీ



కలెక్టర్, అధికారులతో భేటీ అయిన వాయుసేన అధికారులు

సుభాష్‌నగర్: భారత వాయు సేన (ఇండియన్ ఎయిర్‌ఫోర్స్)లో అగ్నివీర్ వాయు (మ్యూజీషియన్) పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ జారీ అయ్యిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. అర్హులైన యువతీ, యువకులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భారత వాయుసేనకు చెందిన వింగ్ కమాండర్ గురుప్రీత్ అత్వాల్, నాన్ కమిషన్డ్ ఆఫీసర్ సందీప్ గురువారం కలెక్టర్‌ను కలిసి నియామక ర్యాలీ వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అగ్నివీర్ వాయు (మ్యూజీషియన్) పోస్టుల భర్తీ కోసం భారత వాయుసేన జూలైలో నియామక ర్యాలీ నిర్వహించనుందన్నారు. కాన్పూర్, బెంగళూరు నగరాల్లో రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఉంటుందని, పదోతరగతి ఉత్తీర్ణులై, 2004 జనవరి 2 నుంచి 2007 జూలై 2 తేదీ మధ్య జన్మించిన అవివాహిత స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. పియానో, గిటార్, వయొలిన్, శాక్సోఫోన్, తబలా వంటి సంగీత, వాద్య పరికరాల్లో ఏదైనా ఒకదానిలో ప్రావీణ్యం ఉన్న సంగీతకారులు మాత్రమే https://agnipathvayu.cdac.in/AV/ ద్వారా జూన్ 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధించిన తేదీ, సమయం, వేదిక తదితర వివరాలను అడ్మిట్ కార్డులో వాయుసేన పొందుపరుస్తుందని తెలిపారు. అగ్నివీర్ వాయు నియామక ర్యాలీపై విస్తృత ప్రచారం చేయాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో వాయుసేన అధికారులతోపాటు జెడ్పీ సీఈవో ఉష, జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్ శ్రీనివాస్, డీఈవో దుర్గాప్రసాద్, జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ముత్తెన్న తదితరులు పాల్గొన్నారు.

నిధులు లేక నిస్తేజం

- పల్లెల్లో కనిపించని చెత్త సేకరణ, పారిశుధ్య పనులు
- సిబ్బంది వేతనాలకూ తప్పని వెతలు
- 'ప్రత్యేక' పాలనలో జాడలేని నిధులు
- జీపీల ఖజానాకు రావాల్సింది రూ.25 కోట్లకుపైనే..

సుభాష్‌నగర్: గ్రామపంచాయతీలు నిధులు లేక నిస్తేజంగా మారాయి. జీపీల ఖాతాల్లో నిధులు నిండుకున్నాయి. నాలుగు నెలల ప్రత్యేక పాలనలో జిల్లాకు ఎస్‌ఎఫ్‌సీ, ఆర్థిక సంఘం నిధులు జాడలేవు. కేవలం పన్ను వసూళ్ల ద్వారా వచ్చిన నిధులతో పంచాయతీ కార్యదర్శులు నెట్టుకొస్తున్నారు. నాలుగు నెలలుగా మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలు ఇవ్వడంలేదు. కొన్ని గ్రామాల్లో ఇంటింటి చెత్త సేకరణ నిలిపేయడంతో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వర్షాకాలంలో పరిస్థితి ఇలాగే ఉంటే రోగాలబారిన పడతామని, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం పల్లెలవైపు కన్నెత్తి చూడాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లాలో 530 గ్రామపంచాయతీలు ఉన్నాయి. పల్లెల్లో పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రత్యేక పాలన ప్రారంభమై నాలుగు నెలలు కావస్తోంది. నేటి వరకూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్క రూపాయిని పంచాయతీలకు మంజూరు చేయలేదు. జిల్లాకు 11 నెలల ఎస్‌ఎఫ్‌సీ నిధులు, మార్చి, ఏప్రిల్, మే నెలల ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.25 కోట్ల వరకు రావాల్సి ఉంది. గ్రామపంచాయతీల్లో రెగ్యులర్‌గా నిర్వహించే కార్యకలాపాలు చాలావరకూ నిలిచిపోయాయి. పంచాయతీ కార్యదర్శులు పన్ను వసూళ్ల ద్వారా వచ్చిన డబ్బులను జాగ్రత్తగా ఖర్చు పెడుతున్నారు. కొందరు అప్పులు చేసి పంచాయతీ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు.



మంచిప్పలో పేరుకుపోయిన చెత్త

అస్తవ్యస్తంగా పారిశుధ్యం

నిధులు లేకపోవడంతో పల్లెల్లో చెత్త సేకరణ రెగ్యులర్‌గా కొనసాగడం లేదు. దీంతో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండటంతో డీజిల్‌కు డబ్బులు లేక రెగ్యులర్‌గా చెత్త సేకరించడం లేదు. మల్టీపర్పస్ కార్మికుల వేతనాలు కూడా నాలుగు నెలలుగా చెల్లించడంలేదు. ఖర్చుల కోసం అరకొర మాత్రమే చెల్లిస్తున్నారు. వేతనాలు రాకపోవడంతో పనులు చేసేందుకు ముందుకు రావడంలేదు.

నిధులు రాగానే జమ చేస్తాం



గ్రామపంచాయతీలకు కొన్ని నెలలుగా నిధులు రావడం లేదు. పన్ను వసూళ్ల ద్వారా వచ్చిన నిధులతో ప్రాధాన్యతాక్రమంలో గ్రామాల్లో పనులు కొనసాగిస్తున్నారు. చెత్త సేకరణ ఎక్కడా నిలిపివేయలేదు. పంచాయతీ కార్యకలాపాలు ఎట్టి పరిస్థితుల్లో నిలిపివేయొద్దని ఆదేశాలిచ్చాం. స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించాం. నిధులు రాగానే గ్రామపంచాయతీల్లో జమ చేస్తాం.

– తరుణ్ కుమార్ చక్రవర్తి, డీపీవో

విద్యాశాఖలో అధికారుల కొరత

- ఖాళీగా ఎంఈవో పోస్టులు
- ఒక్కొక్కరికి 3 నుంచి 4 మండలాల బాధ్యతలు
- జూన్ 3 నుంచి ప్రారంభం కానున్న బడిబాట



నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖను ఎంఈవో పోస్టుల కొరత వేధిస్తోంది. ఒక్కో ఎంఈవో మూడు నుంచి నాలుగు మండలాల బాధ్యతలను నిర్వర్తించాల్సి వస్తుండగా, ఒకరు ఏకంగా ఏడు మండలాలకు ఇన్‌చార్జిగా పని చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఈ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంతోపాటు ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలను వివరిస్తూ విద్యా కార్యక్రమాలు నిర్వహించేందుకు జూన్ 3 నుంచి 'బడిబాట' కార్యక్రమం ప్రారంభం కానుంది. దీనిపై ఎంఈవోల కొరత తీవ్ర ప్రభావం చూపుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

29 మండలాలకు 9 మంది ఎంఈవోలు

జిల్లాలో 789 ప్రాథమిక పాఠశాలలు, 137 ప్రాథమికోన్నత పాఠశాలలు, 269 ఉన్నత పాఠశాలలు ఉండగా, 4897 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే, విద్యాశాఖకు వెన్నుముఖగా భావించే ఎంఈవో పోస్టుల ఖాళీ తీవ్ర ఇబ్బందికరంగా మారింది. 29 మండలాలకు 9మంది ఎంఈవోలు మాత్రమే ఉన్నారు. ఒక్కొక్కరికి మూడు నుంచి నాలుగు మండలాల బాధ్యతలు అప్పగించారు. తాము విధులు నిర్వర్తించే మండలాల మధ్య దూరం ఎక్కువగా ఉండడంతో ఎంఈవోల పర్యవేక్షణ కరువైంది. నిజామాబాద్ సౌత్, నార్త్, ఎడపల్లి, రెంజల్, మోపాల్, నవీపేట, నిజామాబాద్‌రూరల్ మండలాలకు ఎంఈవో రామారావు ఒక్కరే ఇన్‌చార్జీగా కొనసాగుతున్నారు.

నిజామాబాద్ నార్త్, సౌత్ ప్రాంతాలు జిల్లాలోనే పెద్ద మండలాలు కాగా, ఇక్కడ ప్రభుత్వపాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు చాలా ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. అలాగే నందిపేట ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డికి ఇందల్వాయి, డొంకేశ్వర్, ధర్పల్లి మండలాల బాధ్యతల అప్పగించగా, ఆర్మూర్ ఎంఈవో జక్రాన్‌పల్లి, డిచ్‌పల్లి మండలాల ఇన్‌చార్జీగా కొనసాగుతున్నారు. మాక్లూర్ ఇన్‌చార్జి ఎంఈవోగా కొనసాగుతున్న రాజ్‌గంగారెడ్డి గతంలో బదిలీపై భిక్కనూరు బాలికల పాఠశాలకు వెళ్లారు. ప్రస్తుతం ఆయనే భిక్కనూరుతోపాటు మాక్లూర్ మండల ఇన్‌చార్జి బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఎంఈవో పోస్టులు ఖాళీగా ఉండడంతో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో కొనసాగుతున్న పనులపై పర్యవేక్ష లేకుండాపోయింది. పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. డీఈవో ఒక్కరే పనులను పర్యవేక్షించాల్సి వస్తోంది.

గాడితప్పిన పర్యవేక్షణ

ఎంఈవోలు లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో పర్యవేక్షణ గాడితప్పింది. టీచర్ల సమయపాలన తనిఖీ, సకాలంలో సిలబస్ పూర్తి చేయడం, కాలానుగుణంగా టెస్టులు, పరీక్షల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, టీచర్ల గైర్హాజరును అరికట్టడం, ఉపాధ్యాయుల సెలవులు, ఆరోగ్య సమస్యలకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన, పాఠశాలల ఆకస్మిక తనిఖీ తదితర బాధ్యతలను ఎంఈవోలు నిర్వర్తించాల్సి ఉండగా, ఇవన్నీ ప్రస్తుతం మరుగునపడ్డాయి. ప్రైవేటు పాఠశాలల తనిఖీలు అసలే లేవు.

కొరత వాస్తవమే

జిల్లాలో ఎంఈవోల కొరత ఇబ్బందిగానే ఉంది. అయినప్పటికీ ఎక్కడకూడ సమస్యలు రాకుండా జాగ్రత్త పడుతున్నాం. పర్యవేక్షణ పకడ్బందీగా చేస్తున్నాం. నేను ప్రతిరోజూ పాఠశాలలను తనిఖీ చేస్తున్నా. విద్యాబోధన సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నా.

– దుర్గాప్రసాద్, డీఈవో

ఒత్తిడి పెరిగింది

నేను ఒక్కడినే ఏడు మండలాలకు ఇన్‌చార్జి బాధ్యతలు చూస్తున్నా. ఒత్తిడి కారణంగా అన్ని మండలాల్లో పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయలేకపోతున్నా. ప్రతి మండలంలో ప్రభుత్వ కార్యకార్యక్రమలు ఉండడంతో హాజరుకాలేకపోతుననాను. కార్యాలయంలోనూ పూర్తి స్థాయిలో పని చేయలేకపోతున్నా.

– రామారావు, ఇన్‌చార్జి ఎంఈవో

సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ

- అందుబాటులో సరిపడా నిల్వలు
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: వానాకాలం పంట సాగుకు సంబంధించి రైతులకు 60 శాతం సబ్సిడీపై జీలుగ (పచ్చిరొట్ట) విత్తనాలు పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 66 కొనుగోలు కేంద్రాలకు గురువారం నాటికి 6155.2 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను కేటాయించామన్నారు. ఇప్పటికే 5564.1 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేశామని తెలిపారు. జిల్లా రైతాంగానికి సరిపడా జీలుగ విత్తనాలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నామని, రైతుల నుంచి వచ్చే డిమాండ్‌కు అనుగుణంగా ఆయా మండలాలకు జీలుగ విత్తనాలు కేటాయించాలని అధికారులను ఆదేశించామన్నారు.

నకిలీ విత్తన విక్రయాలపై కఠిన చర్యలు

జిల్లాలో నకిలీ విత్తన విక్రయాలను నిరోధించేందుకు గట్టి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాజీవ్‌గాంధీహనుమంతు తెలిపారు. నకిలీ విత్తన విక్రయాలపై నిఘా ఉంచి, బాధ్యులపై కఠిన చర్యలు చేపడుతున్నామన్నారు. నకిలీ, నాసిరకం విత్తనాల విషయమై వ్యవసాయ అధికారులు ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో రైతులను చైతన్యపరుస్తున్నారని తెలిపారు. నకిలీ విత్తనాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. మండల స్థాయిలో వ్యవసాయం, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో కూడిన తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి, ఎరువులు, విత్తన విక్రయ కేంద్రాలను తనిఖీ చేయిస్తున్నామన్నారు. తనిఖీల్లో భాగంగా గురువారం ఆర్మూర్ బృందం సుర్భిర్యాల్ గ్రామంలో అనధికార స్థలంలో నిల్వ చేసిన వరి (5,540 కిలోలు), మొక్కజొన్న (360 కిలోలు), సోయాబీన్ (810 కిలోలు) విత్తనాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారని కలెక్టర్ తెలిపారు. ఈనెల 28న ఆర్మూర్‌లోని బాలాజీ సీడ్స్ - పెస్టిసైడ్స్ నుంచి రూ. 15 వేల విలువైన గడువు ముగిసిన కూరగాయలు, ఉల్లి విత్తనాలను పోలీసు అధికారులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారని తెలిపారు. డీలర్ల నుంచి మాత్రమే విత్తనాన్ని కొనుగోలు చేయాలని, విత్తనాన్ని కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు / ఇన్‌వాయిస్ తీసుకోవాలని సూచించారు. దానిలోలో రైతు పేరు, పంట పేరు, వెరైటీ పేరు, లాట్ నంబర్ ఉండేలా చూసుకోవాలన్నారు. పంట కోసే వరకు రైతులు బిల్లు/ఇన్‌వాయిస్ ను, ఖాళీ విత్తన సంచిని తమ వద్ద భద్రపరచుకోవాలని, అది విత్తనం నకిలీదని తేలితే సాక్ష్యంగా పనిచేస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు.



గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- జూన్ 1 నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్పీఎస్సీ) ద్వారా జూన్ 9న జరుగనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. అభ్యర్థులు జూన్ 1 నుంచి పరీక్ష ప్రారంభమయ్యే వరకు కమిషన్ వెబ్‌సైట్ ద్వారా హాల్ టిక్కెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష సందర్భంగా పాటించాల్సిన నిబంధనల గురించి అభ్యర్థులు పూర్తి అవగాహన ఉండాలన్నారు. జూన్ 9న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాన్నం 1 వరకు పరీక్ష కొనసాగుతుందన్నారు. ప్రిలిమ్స్ పరీక్షకు బయో మెట్రిక్ విధానం ద్వారా వేలి ముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు నిర్ణీత సమయానికి రెండు గంటల ముందే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతిస్తారని, 10 గంటలకు పరీక్షా కేంద్రం గేట్లు మూసివేస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు. అభ్యర్థులు కాలిక్యులేటర్లు, పేజర్లు, సెల్ ఫోన్లు, టాబ్లెట్‌లు, పెన్ డ్రైవ్‌లు, బ్లూటూత్ పరికరాలు, వాచ్, మ్యాథమేటికల్ టేబుల్‌లు, లాగ్ బుక్‌లు, లాగ్ టేబుల్‌లు, వాలెట్, హ్యాండ్‌బ్యాగులు, జోలాలు, పౌచ్‌లు, రైటింగ్ ప్యాడ్‌లు, నోట్స్, లూజ్ షీట్‌లు వంటివి తీసుకురాకూడదని, ఆభరణాలు, ఇతర గాడ్జెట్‌లు/ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, రికార్డింగ్ సాధనాలు అనుమతించబోరని కలెక్టర్ స్పష్టం చేశారు. అభ్యర్థులు షూస్ కాకుండా చెప్పులు ధరించి రావాలని సూచించారు. అభ్యర్థుల సహాయార్థం హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. పరీక్షా సమయం ప్రారంభం నుంచి ముగిసేంత వరకు పరీక్ష కేంద్రం నుంచి అభ్యర్థులతో పాటు ఇన్విజిలేటర్లు కూడా బయటకు వెళ్లేందుకు అనుమతించరన్నారు. పరీక్ష హాల్ నుంచి బయటకు వెళ్లే ముందు, అభ్యర్థి ఓఎంఆర్ పత్రాన్ని ఇన్విజిలేటర్‌కు అందజేయాలన్నారు. నమూనా ఓఎంఆర్ షీట్‌ను రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్ https://www.tspsc. gov.inలో అందుబాటులో ఉంచారని, అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

డిగ్రీ పరీక్షల్లో ఒకరి డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ పరీక్షా కేంద్రంలో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఒక విద్యార్థి డిబార్ అయినట్లు ఆయన తెలిపారు. వర్సిటీ పరిధిలో 38 కేంద్రాల్లో ఉదయం జరిగిన డిగ్రీ 6వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 8,132 మంది విద్యార్థులకు గానూ 7,700 మంది హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన 1వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 3,589 మంది విద్యార్థులకు గానూ 3,417 మంది హాజరైనట్లు తెలిపారు. ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్, జాయింట్ డైరెక్టర్ అతీక్ సుల్తాన్ ఘోరీ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



డిగ్రీ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న చంద్రశేఖర్

నిజామాబాద్‌అర్బన్: నిజామాబాద్ జిల్లాలో గురువారం ఇంటర్ ఎకనామిక్స్, ఫిజిక్స్ సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయి. ఉదయం మొదటి సంవత్సరం విద్యార్థులు మొత్తం 5,291 మందికి గాను 4,955 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలియజేశారు. మధ్యాహ్నం రెండవ సంవత్సరం విద్యార్థులు 2,504 మందికి గాను 2,355 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు చేపట్టారు.

ఆరోగ్య కేంద్రాల ఆకస్మిక తనిఖీ

- ఏఎన్‌ఎంకు మెమో జారీ

నవీపేట: నాగేపూర్, కోస్లీ, నవీపేట-ఏలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కోస్లీలో అందుబాటులో లేని ఏఎన్ఎం మంజులకు మెమో జారీ చేయాలని స్థానిక మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని ఈ సందర్భంగా సూచించారు. ఎండలు తీవ్రమైన నేపథ్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. సాధారణ కాన్పులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ నవ్య, వైద్య సిబ్బంది వెంకటేశ్వర్‌రావ్, కిషన్ ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

ఇంటర్ ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం(2024-25 విద్యా సంవత్సరం) ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ, వొకేషనల్ గ్రూపులలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవడానికి శుక్రవారం(31) తుది గడువని నిజామాబాద్ ఆర్‌సీవో కే.అలివేలు గురువారం తెలిపారు. 2024 మార్చిలో జరిగిన పదవ తరగతి పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. విద్యార్థులు రూ.100 రుసుము చెల్లించి www.tswreis.ac.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌సీవో సూచించారు.

చరిత్రను మార్చే కుట్రకు బీజేపీ పాల్పడుతోంది

- సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర నాయకులు హన్మేష్



ఆర్మూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భౌతికవాద చరిత్రను మార్చే కుట్రకు పాల్పడుతోందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజా పంథా) రాష్ట్ర నాయకులు హన్మేష్ ఆరోపించారు. ఆర్మూర్ మండలంలోని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ రెండు రోజుల రాజకీయ శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దేవారం అధ్యక్షతన రాజకీయ శిక్షణ తరగతులు, ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించగా హన్మేష్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మొదటి రోజు మానవ సమాజం - పరిణామ క్రమం అంశంపై బోధించారు. పెట్టుబడిదారుల దోపిడీని కాపాడడానికే భావవాదాన్ని బీజేపీ నేతలు ముందుకు తెచ్చారు అన్నారు. మతం, కులం అన్న తప్పుడు భావాలని సమాజంపై రుద్దారన్నారు. మత రాజకీయాలను బీజేపీ తన ఎజెండాగా తీసుకొని భారత దేశాన్ని మనువాదం కుట్రలోకి తీసుకెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ వచ్చాక దేశంలో మతమౌఢ్యం, మూఢ విశ్వాసాలు పెరిగాయన్నారు. శ్రమజీవుల రాజ్యాన్ని స్థాపించడం కోసం కృషి చేయాలి అని పిలుపు నిచ్చారు. ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్, రామకృష్ణ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ముత్తెన్న, ఉపాధ్యక్షులు సత్తెమ్మ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు నరేందర్, జిల్లా ఉపాధ్యక్షులు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జూన్ 22 నుంచి తెయూ బీఎస్సీ ప్రాక్టికల్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీఎస్సీ 2, 4, 6వ సెమిస్టర్ రెగ్యులర్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 22 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎం.అరుణ గురువారం తెలిపారు. గ్రూప్- ఏ కళాశాలల్లో జూన్ 22, 24వ తేదీల్లో, గ్రూప్ -బి కళాశాలల్లో జూన్ 29, 30వ తేదీల లోపు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించుకుని సంబంధిత మార్కులను వర్సిటీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కంట్రోలర్ తెలిపారు. పూర్తి వివరాలు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ www.telanganauniversity.ac.inలో పొందుపర్చినట్లు ఆమె తెలిపారు.

మొరం మాఫియా దౌర్జన్యం

ఎడపల్లి(బోధన్): మొరం అక్రమ రవాణాను అడ్డుకోడానికి వెళ్లిన రెవెన్యూ అధికారులపై గురువారం మొరం మాఫియా దౌర్జన్యం చేసింది. ఠాణాకలాన్-కుర్నాపల్లి గ్రామాల శివారులో రెండ్రోజులుగా కొంతమంది అక్రమంగా మొరం తవ్వి తరలిస్తున్నారని రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. దీంతో తహసీల్దార్ ధన్వాల్ మండల ఆర్ఐ వినోద్‌ను, మరో ఇద్దరు వీఆర్‌ఏలను మొరం తవ్వుతున్న ప్రదేశానికి పంపారు. రెవెన్యూ అధికారులు వెళ్లినా మొరం మాఫీయా తవ్వకాలను ఆపకుండా మొరంను ట్రాక్టర్‌లో నింపుతూ తరలిస్తున్నారు. దీన్ని నిరోధించడానికి అడ్డుగా వెళ్లిన వీఆర్‌వో కరుణాకర్‌ను జేసీబీతో నెట్టి వేశారు. మరో వీఆర్‌వోను ట్రాక్టర్ తో ఢీ కొట్టడానికి యత్నించారు. రెవెన్యూ అధికారు లు గట్టిగా ప్రతిఘటించగా జేసీబీ, ట్రాక్టర్లతో నిందితులు పరారయ్యారు. దాదాపు 30 మంది, అధికారులను చుట్టుముట్టి తీవ్ర దుర్భాషలాడారు. జరిగిన ఘటనపై ఎస్సై వంశీ కృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన మద్ది లింగారెడ్డి(54) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఏఎస్సై సంజీవులు తెలిపారు. వివరాలు.. ఆర్థిక ఇబ్బందులతో అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురైన లింగారెడ్డి ఈనెల 25న తాడ్వాయిలోని తన సొంత ఇంట్లో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. అపస్మారక స్థితిలో ఉన్న లింగారెడ్డిని చికిత్స నిమిత్తం కామారెడ్డిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఓ ప్రయివేటు హాస్పిటల్‌కు తరలించారు.. అక్కడ కూడా నయం కాకపోవడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం లింగారెడ్డి మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. లింగారెడ్డికి భార్య రేణుక, కుమార్తె భార్గవి ఉన్నారు. భార్య రేణుక ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకొని శవ పంచనామా నిర్వహించి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

భార్యతో గొడవపడిన వ్యక్తి..



మాచారెడ్డి: పాల్వంచ మండలం ఎలుపుగొండ గ్రామానికి చెందిన కడారి రాములు(33) భార్యతో గొడవ పడి ఈ నెల 27న క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే రోజు కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కుక్కను తప్పించబోయి గాయపడిన యువకుడు..

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మారుతీ సుజికీ షోరూం వద్ద కుక్కను తప్పించబోయి సంకటి సందీప్(21) తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాలు.. డిచ్‌పల్లి మండలం ధర్మారం గ్రామానికి చెందిన సందీప్ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు వినాయక్ నగర్‌లో ఉన్న తన స్నేహితున్ని కలిసేందుకు వినాయక్‌నగర్ వచ్చి మళ్లీ తిరిగి అదే రోజు రాత్రి 8 గంటలకు ధర్మారం వెళ్తుండగా కుక్క అడ్డం రావడంతో అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సందీప్ బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. మృతుడు తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

రోడ్డు దాటుతున్న మహిళ..

నవీపేట: నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పాల్దాలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన తాడెం ఎల్లవ్వ(52) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ గురువారం తెలిపారు. నిజామాబాద్ మండలంలోని కాలూర్‌కు చెందిన తాడెం ఎల్లవ్వ బుధవారం జన్నేపల్లిలో జరిగిన వారాంతపు కూరగాయల సంతకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో మార్గ మధ్యంలో పాల్దాలో ఉండే కుమార్తె దగ్గరికి బస్సులో వెళ్లారు. బస్సు దిగి వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన బైక్ ఢీకొంది. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి




కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణ పరిధిలోని ఒకటో వార్డు అడ్లూరు గ్రామంలో విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి చెందినట్లు బాధిత రైతు కృష్ణంరాజు గౌడ్ తెలిపారు. వివరాలు..అడ్లూరు కోట మైసమ్మ ఆలయ సమీపంలో గల పల్లె ప్రకృతి వనంలో విద్యుత్ వైర్లు తగిలి గేదె మృతి చెందింది. సుమారు రూ. లక్ష వరకు నష్టం జరిగినట్లు అధికారులు ఆదుకోవాలని బాధిత రైతు వాపోయాడు.

వాడి గ్రామంలో మరో గేదె..



మాచారెడ్డి: పాల్వంచ మండలం వాడి గ్రామంలో విద్యుత్ షాక్‌తో ఓ గేదె మృతి చెందింది. వివరాలు.. నిమ్మల చిన్నోళ్ళ సత్తవ్వ గేదె గురువారం వారి చేనులోకి మేతకు వెళ్లింది. గాలికి ఎల్టీ లైన్ విద్యుత్ తీగ గేదెపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధితురాలు తెలిపారు. గేదె విలువ రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితురాలు వేడుకొంది.

నర్వలో ఆవు..



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని నర్వ గ్రామానికి చెందిన కాయితి రాములుకు చెందిన ఆవు గురువారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. రోజు మాదిరిగా పంట పొలాల్లోకి మేతకు వెళ్లిన ఆవు మత్తడిపల్లి శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందింది. దాంతో రాములుకు రూ.45 వేల ఆస్తి నష్టం వాటిల్లింది.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఎడపల్లి(బోధన్): ఠాణాకలాన్ గ్రామ శివారులో గురువారం ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నిజామాబాద్‌కు చెందిన అన్సార్(35) అనే వ్యక్తిగా గుర్తించారు. ఎల్లారెడ్డి నుంచి ఠాణాకలాన్ గ్రామం మీదుగా నిజామాబాద్‌కు వెళ్తున్న సమయంలో ట్రాక్టర్, అన్సారీ ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. అన్సార్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మరొకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు.. మహారాష్ట్రకు చెందిన అజీజ్(38) పని నిమిత్తం నిజామాబాద్ వచ్చాడు. రోడ్డుపై అజీజ్ నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడే మృతి చెందాడు. ఆధార్ కార్డు ఆధారంగా మృతుడి వివరాలు గుర్తించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలం నర్వ శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగలి వినయ్(21) అనే యువకుడు మృతి చెందాడు. వివరాలు..గునుకుల్ గ్రామానికి చెందిన వినయ్, కామారెడ్డి నుంచి ద్విచక్రవాహనంపై రాత్రివేళ ఇంటికి వెళ్తున్నాడు. బాన్సువాడ- ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై నర్వ గ్రామ శివారులోని చిన్నపూలు బ్రిడ్జి వద్ద బోలెరో వాహనం, ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో వినయ్ రోడ్డుపై ఎగిరి పడడంతో తలకు తీవ్ర రక్తస్రావమైంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు అంజయ్య, సాయవ్వ కన్నీటి పర్యంతం అయ్యారు. నిజాంసాగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మంగలి వినయ్(ఫైల్)

మట్టి తరలిస్తున్న వాహనాలు స్వాధీనం

రుద్రూర్: ఎలాంటి అనుమతి లేకుండా మండలంలోని చిక్కడపల్లి చెరువులో చేపడుతున్న మట్టి తవ్వకాలను గురువారం స్థానికులు అడ్డుకున్నారు. అనంతరం తహసీల్దార్‌కు సమాచారం అందించారు. వెంటనే తహసీల్దార్ వెంకటేశం మట్టి తరలిస్తున్న ప్రాంతానికి చేరుకుని అక్కడ ఉన్న వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ నజీర్ ద్వారా పంచనామా చేయించి జేసీబీ, ఆరు ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. చిక్కడపల్లి చెరువులో మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని అన్నారు. అక్రమంగా మొరం, మట్టి, ఇసుక తరలిస్తే వాహనాలు సీజ్ చేయడంతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



స్వాధీనం చేసుకున్న జేసీబీ, ట్రాక్టర్లు

మృతుడి ఆచూకీ లభ్యం

నవీపేట: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో బుధవారం మృతి చెందిన మృతుడి ఆచూకీ లభ్యమైనట్లు ఎస్సై యాదగిరిగౌడ్ గురువారం తెలిపారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్ మండలం నాయగామ్‌కు చెందిన గంగారామ్ తన భార్య అనారోగ్యంతో బాధపడుతుండగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో అడ్మిట్ చేశాడని, తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలోని బస్టాండ్‌లో దిగాడని పేర్కొన్నారు. అదే సమయంలో ఫిట్స్ రావడంతో మృతి చెందాడని పేర్కొన్నారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో పేకాటాడుతున్న 11 మందిని గురువారం టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు పేకాట స్థావరంపై దాడి చేశారు. వారి నుంచి రూ.94 వేల 600 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే కేసులు నమోదు చేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

బాల్కొండ: మెండోరా మండల కేంద్రం శివారులోని ఓ రైస్ మిల్లులో దాచిన 130 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. రైస్ మిల్లులో భారీగా పీడీఎస్ బియ్యం నిల్వలు ఉన్నాయని, వాటిని మూడు వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలించటానికి సిద్ధమవుతున్నారని పక్కా సమాచారం రావడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో దాడులు చేయగా భారీగా బియ్యం పట్టుబడ్డాయి. బియ్యాన్ని, వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్సై శ్రీనివాస్ యాదవ్, తహసీల్దార్ సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

- మేడపై నిద్రిస్తుండగా ఘటన
- రెండు తులాల బంగారం.. 20 తులాల వెండి.. రూ.15 వేల నగదు అపహరణ

బోధన్‌టౌన్(బోధన్): పట్టణ శివారులోని శ్రీనివాస క్యాంప్ కాలనీలో నాగంపల్లి శ్రీకాంత్ అనే వ్యక్తి ఇంట్లో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నాగంపల్లి శ్రీకాంత్ తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం రాత్రి ఇంటికి తాళం వేసి మేడపై నిద్రపోయారు. ఉదయం లేచి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగుల గొట్టి ఇంట్లోకి చొరబడి బీరువా తాళం తీసి రెండు తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.15 వేల నగదును దోచుకెళ్లారు. ఇంట్లో వస్తువులన్నీ చిందర వందరగా పడేశారు. ఈ విషయం గురించి బాధితుడు పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకున్న చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరయ్య తెలిపారు.



ఇంట్లో చిందరవందరగా పడి వున్న వస్తువులు

సదాశివనగర్‌లో..

రామారెడ్డి: సదాశివనగర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల పక్కన గల తోకల నరేందర్‌కు చెందిన జనరల్ స్టోర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. షాప్ వెనుక వైపు గోడకు కన్నం చేసి లోపలికి చొరబడి, రూ.8,200 నగదును ఎత్తుకెళ్లినట్లు నరేందర్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



వెనక వైపు దొంగలు వేసిన కన్నం

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం.. కాపర్, ఆయిల్ చోరీ



డిచ్‌పల్లి: వెస్లీనగర్ తండా శివారులో రెండు, నాకాతండా గ్రామ శివారులోని రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి వాటిలో నుంచి కాపర్ కాయిల్స్, ఆయిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు డిచ్‌పల్లి ఎస్సై మహేష్ తెలిపారు. రెండు, మూడు రోజులుగా రెండు తండాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి కాపర్, ఆయిల్‌ను దొంగతనం చేసినట్లు మెంట్రాజ్‌పల్లి లైన్‌మెన్ ఈశ్వర ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నాలుగేళ్ల పాప దారుణ హత్య

మాక్లూర్: తనకు పుట్టిన బిడ్డ కాదన్న నెపంతో నాలుగేళ్ల బాలికను గొంతు నొక్కి హతమార్చాడు వరుసకు తండ్రి అయిన వ్యక్తి. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం ధర్మోరా గ్రామంలో బుధవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మోరాకు చెందిన ఈర్నాల అరుణ్‌కు మొదటి భార్యతో విడాకులు అయ్యాయి. అనంతరం నిజామాబాద్ నగరానికి చెందిన సునీతను రెండో వివాహం చేసుకున్నాడు. అప్పటికే సునీతకు మొదటి భర్తతో విడాకులు కాగా లక్ష్మి అనే పాప ఉంది. పాపను సొంతకూతురిగా చూసుకుంటానని పెద్దల సమక్షంలో చెప్పి అరుణ్ సునీతను పెళ్లి చేసుకున్నాడు. ఆరు నెలల వరకు పాపను సొంతబిడ్డ మాదిరిగా చూసుకున్న అరుణ్‌లో తర్వాత మార్పు వచ్చింది. రోజూ పాపను హింసించడం ప్రారంభించాడు. కనికరం లేకుండా మూడు నెలల క్రితం చితక బాది చేయి విరగ్గొట్టాడు. అప్పటి నుంచి సునీత తన బిడ్డను నిజామాబాద్‌లోని తల్లిదండ్రుల వద్దే ఉంచుతోంది. ఈ నెల 29న తన బిడ్డ లక్ష్మి ని చూసి వస్తానని చెప్పి సునీత నిజామాబాద్ వెళ్లింది. తిరుగు ప్రయాణంలో చిన్నారి ఏడ్వటంతో రెండు రోజులు ఉంచుకుని పంపిస్తానని తల్లి తండ్రులకు చెప్పి సునీత లక్ష్మిని వెంటబెట్టుకుని ధర్మోర వచ్చింది. మళ్లీ బిడ్డను తీసుకొచ్చిందని అరుణ్ భార్య సునీతపై మండిపడ్డాడు. భోజన అనంతరం సునీత బాత్‌రూమ్‌కు వెళ్లింది గమనించిన అరుణ్ నిద్రిస్తున్న లక్ష్మిని గొంతు నొక్కి హతమార్చాడు. నార్త్‌జోన్ సీఐ సతీష్, ఎస్సై సుధీర్‌రావు పంచనామా నిర్వహించారు. సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



హత్యకు గురైన నాలుగేళ్ల పాప లక్ష్మి